సాక్షి
అనంతపురం
శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



ముడుపులిచ్చుకో.. మట్టి తవ్వుకో

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎర్రమట్టి దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. IIలో



కిలో టమాట రూ.33

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.33, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.20 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం 35.1°/22.7°

జిల్లా అంతటా గురువారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

పంట నష్టం రూ.3.96 కోట్లు



అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల తాకిడికి రూ.3.96 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 457 హెక్టార్లలో వరి, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం తదితర పంటలు దెబ్బతినడంతో 481 మంది రైతులకు రూ.2.66 కోట్లకు పైగా నష్టం జరిగిందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. అలాగే బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మఘట్ట, కణేకల్లు, డి.హీరేహాళ్, బుక్కరాయసముద్రం, పామిడి, కూడేరు, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, రాప్తాడు, ఆత్మకూరు, నార్పల, బెళుగుప్ప మండలాల పరిధిలో 37 గ్రామాల్లో టమాట, మిరప, బీర, సొర, వంగ, అరటి, చీనీ, ద్రాక్ష, దానిమ్మ, ఉసిరి, మామిడి, కర్భూజా, కళింగర తదితర ఉద్యాన పంటలు 135 హెక్టార్లలో దెబ్బతినడంతో 119 మంది రైతులకు 1.30 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. చేతికొచ్చిన పంట నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌లో గత జూన్ నుంచి ఇప్పటి వరకు రూ.15 కోట్ల నుంచి రూ.17 కోట్ల వరకు పంట నష్టం జరిగినా ఇన్‌పుట్ జాబితా బాగా తగ్గిస్తుండటంతో అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు.

‘పరివాహన్’లోనే పన్నులు కట్టాలి

- డీటీసీ వీర్రాజు

అనంతపురం సెంట్రల్: జిల్లాలో వాహనదారులు తమ వాహనాల త్రైమాసిక పన్నులను ఇకపై ‘పరివాహన్ జీఓవీ’ వెబ్‌సైట్‌లోనే చెల్లించాల్సి ఉంటుందని ఉపరవాణా కమిషనర్ (డీటీసీ) వీర్రాజు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రవాణా శాఖ అన్ని సేవలను పరివాహన్ వెబ్‌సైట్‌కు మార్చినట్లు వెల్లడించారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం



నమూనాలను పరిశీలిస్తున్న ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువులతో పాటు నైపుణ్యాలు ఎంతో అవసరమని ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కొర్రపాడులో ఉన్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ ఫేర్–2024 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జిల్లా కోఆర్డినేటర్ ఉదయశ్రీ, ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నతంగా రాణించగలరన్నారు. ఏదో ఒక అంశంపై నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. సమాజంలో ప్రతి అంశం సైన్స్‌తో ముడిపడిఉందన్నారు. నిజ జీవితంలో సైన్సును బాగా అధ్యయనం చేయాలన్నారు. టెక్నాలజీ ఉపయోగించుకుని చదివితే సులభతరమవుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన నమూనాలను పరిశీలించారు. కాగా, సైన్స్‌ఫేర్‌లో 235 మంది విద్యార్థులు 165 నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ లింగానాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఆర్ట్స్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవి, మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శివ శంకర్, కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ బృంద, రసాయన శాస్త్రం ప్రొఫెసర్ డాక్టర్ వాసుదేవ, గణిత శాస్త్ర ప్రొఫెసర్ గోవిందరాజులు, డాక్టర్ గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓగా ఎ.మలోల



అనంతపురం అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారిగా (డీఆర్‌ఓ) ఎ.మలోల నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 26 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ వివిధ జిల్లాలకు డీఆర్‌ఓలుగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వుల (జీఓ 1816)ను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న మలోలను డీఆర్‌ఓగా నియమించారు. ప్రస్తుతం డీఆర్‌ఓగా ఉన్న జి.రామకృష్ణారెడ్డిని జీఏడీలో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, మలోలా గతంలో అనంతపురం ఆర్డీఓగా పనిచేశారు.

రైతన్నకు రిక్తహస్తం!



‘వ్యవసాయం దండగ’ అంటూ గతంలోనే వ్యాఖ్యానించిన చంద్రబాబు రైతు వ్యతిరేక విధానాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన రోజునుంచే రైతుల నడ్డి విరిచేందుకు సిద్ధమయ్యారు. 9 గంటల ఉచిత కరెంటుకు కోతలు పెడుతూ రైతులకు వాతలు పెడుతున్నారు. అన్నదాతలపై పైసా భారం పడకుండా గత ప్రభుత్వం ఐదేళ్లు విజయవంతంగా అమలు చేసిన ‘వైఎస్సార్ ఉచిత పంటల బీమా’కు మంగళం పాడేందుకు తాజాగా సిద్ధమయ్యారు.

- అన్నదాతలపై చంద్రబాబు సర్కారు పిడుగు
- ఉచిత పంటల బీమాకు మంగళం
- గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన బృహత్తర పథకానికి ఫుల్‌స్టాప్
- ఆపదలో ఆదుకోకుండా భారం మోపడంపై రైతుల మండిపాటు

అనంతపురం అగ్రికల్చర్: అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తయినా రైతుకు ఎలాంటి సాయం అందించని చంద్రబాబు ప్రభుత్వం నేడు ఉచిత పంటల బీమా పథకానికి కూడా మంగళం పాడేసింది. ఈ అక్టోబర్ నుంచి మొదలైన రబీ పంటలకు సంబంధించి అన్నదాతలపై బీమా ప్రీమియం భారం మోపింది. గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఉచిత బీమా పథకం అమలుతో పాటు పెద్ద ఎత్తున పరిహారం తీసుకుంటూ ప్రశాంతంగా ఉన్న రైతుల నెత్తిపై ఒక్కసారిగా పిడుగు వేసింది. ఇక నుంచి ప్రీమియం కడితే తప్ప బీమా వర్తించదని తేల్చిచెప్పింది. అలాగే ఈ–క్రాప్, ఈ–కేవైసీ కూడా తప్పనిసరి చేసింది. పంటల బీమా పథకంపై గురువారం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రీమియం కింద బీమా పథకం అమలులోకి తెస్తున్నట్లు ప్రకటించారు.

డిసెంబర్ 15 లోపు ప్రీమియం..

ఈ రబీలో ఫసల్‌బీమా కింద గ్రామం యూనిట్‌గా ప్రధానపంట పప్పుశనగ, మండలం యూనిట్‌గా వరి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ పంటలను చేర్చగా, వాతావరణ బీమా కింద టమాట పంటను నోటిఫై చేశారు. అటు శ్రీ సత్యసాయి జిల్లాలో ఫసల్ బీమా కింద మండలం యూనిట్‌గా వరి, వేరుశనగ, వాతావరణ బీమా కింద టమాటను గుర్తించారు. జిల్లాలో గుర్తించిన పంటలు 1.05 లక్షల హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా వేశారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 25 వేల హెక్టార్లలో పంటలు సాగులోకి రావచ్చని అంచనా వేశారు. పప్పుశనగ రైతులు తమ వాటా కింద ప్రీమియం రూపంలో వ్యవసాయ పంటలకు 1.5 శాతం, ఉద్యానపంటలకు 5 శాతం భరించాలి. అంటే పప్పుశనగకు హెక్టారుకు రూ.1,125 ప్రకారం, వేరుశనగ రైతులు హెక్టారుకు రూ.1,200 ప్రకారం చెల్లించాలి. అలాగే వరి హెక్టారుకు రూ.1,575, జొన్న హెక్టారుకు రూ.788, మొక్కజొన్న హెక్టారుకు రూ.1,313 ప్రకారం, అలాగే టమాట రైతులు హెక్టారుకు రూ.4 వేల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. డిసెంబర్ 15 లోపు బ్యాంకులు, కామన్ సర్వీసు సెంటర్లు (సీఎస్‌సీ), మీ–సేవా, నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ (ఎన్‌సీఐపీ)లో రైతులు ప్రీమియం చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చారు. అప్‌డేషన్ చేసిన ఆధార్‌కార్డులు, 1–బీ, బ్యాంకు పాస్ పుస్తకాలు, కౌలు రైతులు అయితే సీసీఆర్‌సీ పత్రాలు, ఫోన్ నంబర్ తదితర వివరాలు సమర్పించి ప్రీమియం కట్టాల్సి ఉంటుంది. పంటలు సాగు చేసినట్లు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి చేశారు.

రైతు సంఘాల ఆగ్రహం..

ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడిన కూటమి సర్కారు ప్రీమియం రూపంలో భారం మోపడంపై రైతులు మండిపడుతున్నారు. ఏటా ఖరీఫ్‌లో రూ.50 కోట్లు, రబీలో రూ.15 కోట్లకు పైగా జిల్లా రైతులపై భారం పడనుంది. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా ఖరీఫ్‌లో రూ.40 కోట్లు, రబీలో రూ.5 కోట్ల వరకు ప్రీమియం రూపంలో పిండుకోనున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు సర్కారు రైతు వ్యతిరేక చర్యలపై రైతు సంఘాలు, విపక్షాలు ధ్వజమెత్తడానికి సిద్ధమవుతున్నాయి.

హెక్టారుకు రైతులు చెల్లించాల్సిన ప్రీమియం ఇలా..

పప్పుశనగ	రూ.1,125
వేరుశనగ	రూ.1,200
టమాట	రూ.4 వేలు

ఏటా ఉమ్మడి జిల్లా రైతులపై భారం రూ.110 కోట్ల భారం

రైతు వ్యతిరేక చర్యలు వీడాలి



చంద్రబాబు రైతు వ్యతిరేక చర్యలు వీడాలి. రైతులపై భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టి ప్రీమియాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరించింది. ఎన్ని ఎకరాల్లో పంటలు సాగైతే అన్ని ఎకరాలకు జగన్ ప్రభుత్వం ప్రీమియం చెల్లించింది. దీంతో రైతులకు ఏ ఢోకా లేకుండా పోయింది. ప్రకృతి వైపరీత్యాలతో పంట దెబ్బతింటే సకాలంలో పరిహారం దక్కింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. రైతులను ఆదుకోవాలే కాని నిండా ముంచేలా వ్యవహరించడం సరికాదు. గతంలాగే బీమా ప్రీమియం చెల్లించాలి.

– నాగేంద్రప్ప, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

బాబు నిర్ణయం దుర్మార్గం



గత ఐదేళ్లు అమలైన ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేయడం బాధాకరం. ఇది రైతులకు తీరని ద్రోహమే. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతులు, వ్యవసాయంపై ఎప్పుడూ చిన్న చూపే. వ్యవసాయం దండగ అని, ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తే విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవాలని గతంలో రైతులను హేళన చేశారు. రైతులపై పైసా భారం పడకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన పథకాన్ని నిలిపివేయడం దుర్మార్గం.

– గోపాల్ రెడ్డి, రైతు, మర్తాడు, గార్లదిన్నె మండలం

తమ్ముళ్ల మద్యం పంచాయితీ



వాగ్వాదం చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

కళ్యాణదుర్గం: పట్టణంలో ‘తెలుగు తమ్ముళ్ల’ మధ్య మద్యం పంచాయితీ నెలకొంది. ఈనెల 14న మద్యం దుకాణాల కేటాయింపు కోసం అనంతపురంలో లాటరీ తీశారు. ఈ క్రమంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో 127వ మద్యం షాపును దినేష్ కుమార్ నాయుడు దక్కించుకున్నాడు. అనంతరం పట్టణంలోని బళ్లారి మిట్టపై మద్యం షాపును ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో షాపు వదులుకోవాలని, లేకుంటే ఇబ్బందులకు గురవుతావంటూ ఏకంగా టీడీపీ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులు బెదిరించారంటూ ఆరోపణలు వచ్చాయి.

అనేక రకాలుగా వేధింపులు..

బెదిరింపులకు దినేష్ లొంగకపోవడంతో అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారు. కళ్యాణదుర్గం జూనియర్ కళాశాల రోడ్డులో అతను నిర్వహిస్తున్న శ్రీరాఘవేంద్ర హోటల్‌పై మున్సిపల్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను ఉసిగొల్పారు. హోటల్ నిర్వహణ సక్రమంగా లేదని, మున్సిపల్ అప్రూవల్ లేదంటూ భయపెట్టే ప్రయత్నం చేశారు.

తాజాగా కేసు పెట్టేందుకు యత్నం

కళ్యాణదుర్గంలోని బళ్లారి మిట్టపై ఉన్న దినేష్ మద్యం దుకాణం వద్దకు గురువారం టీడీపీ నేతలు కొందరు వెళ్లారు. తమకు వాటా ఇవ్వకపోతే దుకాణం తెరవనివ్వబోమంటూ రెండు గంటల పాటు హంగామా చేశారు. దీంతో దినేష్, టీడీపీ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. డీఎస్పీ రవిబాబు, పట్టణ సీఐ వెంకటరమణ అక్కడికి వెళ్లి టీడీపీ శ్రేణులను తరిమి కొట్టారు.

డీఎస్పీ కార్యాలయం వద్ద హైడ్రామా

అనంతరం టీడీపీ నేతలు దినేష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్యం షాపు విషయంలో మోసం చేశారంటూ దినేష్‌పై కేసు పెట్టాలని టీడీపీ సీనియర్ నేతలు మోరేపల్లి మల్లికార్జున, మాజీ జెడ్పీటీసీ రామ్మోహన్ చౌదరి, లక్ష్మీనారాయణ చౌదరి, వైపీ రమేష్, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, కళ్యాణదుర్గం మండల కన్వీనర్ గోళ్ల వెంకటేశులు, అబ్దుల్ రెహమాన్, హనుమంతరెడ్డి తదితరులు డీఎస్పీపై ఒత్తిడి తెచ్చారు. అనంతరం వారంతా బయటికి రాగానే టీడీపీ శ్రేణులు డీఎస్పీ కార్యాలయం ఎదుట హంగామా చేశారు. దీంతో అక్కడే ఉన్న డీఎస్పీ, పోలీసు సిబ్బంది టీడీపీ శ్రేణులను చెదరగొట్టారు. ఈ క్రమంలో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాగా, మద్యం షాపునకు తాము ఏడుగురు కలిసి టెండరు వేశామని, ఇందులో తమకు వాటా ఉందని టీడీపీ నేతలు చెప్పగా.. దినేష్ మాత్రం తనతో ఎవరూ వాటా కలుపుకోలేదని తాను మాత్రమే టెండరు వేసినట్లు చెప్పడం కొసమెరుపు. తాను టీడీపీ నాయకుడినే అయినా మద్యం టెండరు రావడంతో సొంత పార్టీ నేతలే ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన వాపోయారు.

ఆక్రమణలు తొలగిస్తాం

- సంయుక్త తనిఖీ, సర్వే ద్వారా గుర్తించి చర్యలు
- 1,675 మంది వరద ప్రభావానికి గురయ్యారు
- 456 హెక్టార్లలో రూ.2.66 కోట్ల పంట నష్టం
- పశు నష్టం రూ.10.30 లక్షలు
- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: ‘వంకలు, వాగుల ఆక్రమణను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆక్రమణలను సర్వే ద్వారా గుర్తించి తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా పండమేరు వాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తాం’ అని కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. భారీ వర్షాలు, వరద పరిస్థితి, చేపట్టిన చర్యల వివరాలను గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విలేకరులకు ఆయన వెల్లడించారు. భారీ వర్షాలు, వరద కారణంగా జిల్లావ్యాప్తంగా 17 మండలాల్లోని 42 గ్రామాల్లో 481 మంది రైతులకు సంబంధించి 456.92 హెక్టార్లలో రూ.2.66 కోట్ల పంట నష్టం వాటిల్లిందన్నారు. 68.20 హెక్టార్లలో రూ.73.19 లక్షల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయన్నారు. 40 కచ్చా ఇళ్లు దెబ్బతినడంతో రూ.4 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. 100 మేకలు, గొర్రెలు, రెండు దూడలు చనిపోయాయని, వీటి విలువ రూ.10.30 లక్షలు ఉంటుందన్నారు. ఒక పట్టణం, 17 మండలాల పరిధిలోని 42 గ్రామాల్లో 1,675 మంది వరద ప్రభావానికి గురయ్యారన్నారు. సహాయక చర్యలు పూర్తి స్థాయిలో చేపట్టామన్నారు. 375 మంది వరద బాధితులకు మూడు పునరావాస కేంద్రాల్లో వసతి కల్పించామన్నారు. 1,995 భోజన ప్యాకెట్లు, 560 బిస్కెట్ ప్యాకెట్లు, 5,535 నీటి ప్యాకెట్లు, 620 మందికి పాలు అందించామన్నారు. అదే విధంగా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. సమావేశంలో ఆర్డీఓ వసంత బాబు, డీపీఎం ఆనంద్, కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలు ప్రజలకు చేర్చాలి

కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) పథకాలను ప్రజల దరిచేర్చి వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులు, బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బ్యాంకర్లు, డీఆర్‌డీఏ, నాబార్డ్, తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు ఉన్నవారు సహజ మరణం పొందితే పీఎంజేజేబీవై పథకం ద్వారా రూ.2 లక్షల పరిహారం పొందవచ్చన్నారు. ప్రమాద మరణం పొందితే పీఎంఎస్‌బీవై ద్వారా రూ.2 లక్షలు, పీఎంజేజేబీవై ద్వారా రూ.2 లక్షలు మొత్తం రూ.4 లక్షల పరిహారం అందుతుందన్నారు. అలాగే, 51 ఏళ్ల నుంచి 70 ఏళ్ల లోపు ఉన్నవారు ప్రమాద మరణం పొందితే పీఎంఎస్‌బీవై ద్వారా రూ.2 లక్షల పరిహారం పొందవచ్చని చెప్పారు. మారుమూల గ్రామాల్లోని ప్రజలకు చేరేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రత్యేక అధికారుల వాట్సాప్ గ్రూప్‌లో ఎల్‌డీఎంను చేర్చాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ సహాయకుల సేవలను వినియోగించుకోవాలని ఎల్‌డీఎంకు సూచించారు. నిర్దేశిత లక్ష్యాలను నవంబరు 19వ తేదీలోగా పూర్తికి కృషి చేయాలని చెప్పారు. జిల్లాలోని 30 బ్యాంకులకు సంబంధించి ఒక్కో బ్యాంకు నుంచి ఒక నోడల్ అధికారి ఉండేలా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ఎల్‌డీఎంకు సూచించారు. గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు రక్షిత తాగునీటిని అందించే విషయంపై దృష్టి పెట్టాలని బ్యాంకర్లను కలెక్టర్ కోరారు. సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)లో భాగంగా ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బీమా పథకాల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్‌డీఎం నరసింహా రావు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, నాబార్డ్ డీడీఎం అనురాధ, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసనాయక్, ఇతర అధికారులు, బ్యాంక్ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

వివాదాస్పద డీఈఓ వరలక్ష్మి బదిలీ

- చిత్తూరు జిల్లాకు పంపిన ప్రభుత్వం
- కొత్త డీఈఓగా ఎం.ప్రసాద్‌బాబు నియామకం



వరలక్ష్మి



ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: తీవ్ర వివాదాస్పదంగా మారిన డీఈఓ బి. వరలక్ష్మి ఎట్టకేలకు బదిలీ అయ్యారు. ఈమె స్థానంలో అన్నమయ్య జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఎం. ప్రసాద్ బాబును నియమించారు. వరలక్ష్మిని ప్రభుత్వం చిత్తూరు జిల్లాకు బదిలీ చేసింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ప్రసాద్ బాబుకు జిల్లాలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన అనుభవం ఉంది.

తీవ్ర అపవాదు మూటకట్టుకున్న వరలక్ష్మి..


జిల్లాలో పని చేసినన్ని రోజులూ వరలక్ష్మి తీవ్ర అపవాదు మూటగట్టుకున్నారు. పది నెలల్లో కనీసం పది స్కూళ్లు కూడా తనిఖీలు చేసిందిలేదు. గంటల తరబడి కార్యాలయానికే పరిమితమయ్యారు. టీచర్లు ఏ మేరకు చదువు చెబుతున్నారు? వివిధ సర్వేల ఫలితాల ఆధారంగా ఎంఈఓలు, హెచ్‌ఎంలతో సమీక్షలు చేసిందిలేదు. వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధికి తీసుకున్న చర్యలేమీ లేవు. సమగ్ర శిక్ష ఎస్పీడీ, ఇతర అధికారులు నిర్వహించిన కాన్ఫరెన్సుల్లోనూ డీపీసీ హోదాలో పాల్గొన్న సందర్భాలు వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఏపీసీ బాధ్యతలు తీసుకునేందుకు ససేమిరా అన్నారు. స్వయంగా ఎస్పీడీ జారీ చేసిన ఉత్తర్వులను తుంగలో తొక్కారు. చిన్న పనికీ కార్యాలయంలో సిబ్బంది పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తెచ్చారు. చివరకు పనిదినాల్లోనూ అర్ధరాత్రి వరకు సిబ్బంది కార్యాలయాల్లోనే ఉన్న సందర్భాలు చాలా ఉన్నాయి. సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులను రిలీవ్ చేయడంలోనూ, నోటిఫికేషన్ జారీ, దరఖాస్తుల పరిశీలనలో వివాద స్పద నిర్ణయాలు తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నారు. చివరకు కలెక్టర్ వినోద్ కుమార్‌ను బోల్తా కొట్టించి వివిధ ఫైళ్లలో తప్పులు చేయించారు. ఈ అంశాలను ‘సాక్షి’ ఆధారాలతో సహా వెలుగులోకి తెచ్చింది. ఈ కథనాలపై డీఈఓ కార్యాలయ సిబ్బంది, అటు సమగ్రశిక్ష కార్యాలయం ఉద్యోగులు, సామాన్య టీచర్లు పెద్ద ఎత్తున చర్చించుకున్నారు. వివిధ సందర్భాల్లో స్వయంగా విద్యాశాఖ కమిషనర్ జోక్యం చేసుకోవాల్సిన దుస్థితి కూడా తలెత్తింది.

ఆరోపణలు వచ్చినా..

స్కూల్ కాంప్లెక్స్‌ల రీఆర్గనైజేషన్ ప్రక్రియ మొత్తం డీసీఈబీ కార్యదర్శి చేయాల్సి ఉంది. ఈ వర్క్ మొత్తం ఓ ఎంఈఓ–2తో వరలక్ష్మి చేయించారు. ఈయన దాదాపు నెలన్నరపాటు ఇదే పనిపై పోరాటం చేస్తున్నారు. డీఈసీబీ ప్రశ్నపత్రాల తయారీపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చినా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే దాట వేశారు.

- వరలక్ష్మి నిర్వాకంతో గతేడాది నిర్వహించిన నేషనల్ అసెస్‌మెంట్ సర్వేకు సంబంధించి రూ.20 లక్షల నిధులు వెనక్కువెళ్లిపోయాయి. ఈ నిధులను డీసీఈబీకి విడుదల చేస్తే వారు ఖర్చు చేసి తక్కిన మొత్తం వెనక్కు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది మార్చి 25,26 తేదీల్లో నిధులు మంజూరయ్యాయి. వెంటనే బిల్లులు పెట్టి ఉంటే సరిపోయేది. బిల్లులు పెట్టడంలో సెక్రటరీ నిర్లక్ష్యం చేయడం, డీఈఓ పట్టించుకోకపోవడంతో పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది. ఈలోగా మార్చి 31 దాటిపోయి నిధులు వెనక్కు పోయాయి. సర్వేలో పాల్గొన్న ఇంజినీరింగ్ విద్యార్థులకు డీసీఈబీ నిధుల నుంచి వాడుకున్నారు. వాడుకున్న డబ్బును డీసీఈబీకి రీయింబర్స్ చేయాల్సి ఉంది. ఎంఈఓలు, సీఆర్పీలకు ఇప్పటిదాకా పైసా చెల్లించలేదు.

టీబీ డ్యాం @101.539 టీఎంసీలు



టీబీ డ్యాం గేట్ల ద్వారా బయటకు వెళ్తున్న నీరు

బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. నీటితో డ్యాం నిండుకుండలా మారింది. గురువారం 16 క్రస్ట్ గేట్ల ద్వారా 86,487 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేశారు. డ్యాం ఎగువ భాగంలోని ఆగుంబే, శృంగేరి, తీర్థనహళ్లి, వరనాడు, శివమొగ్గ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జలాశయానికి వరద కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 97,751 క్యూసెక్కులుండగా అవుట్‌ఫ్లో 96,487 క్యూసెక్కులుగా నమోదవుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 101.539 టీఎంసీలు నిల్వ ఉంచుతూ మిగతా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద 1,780 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

క్లుప్తంగా

బాణాసంచా విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలి

• జేసీ శివనారాయణశర్మ


అధికారులతో సమీక్షిస్తున్న జేసీ

అనంతపురం అర్బన్: దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలని, ఈ మేరకు వారిలో చైతన్యం తీసుకురావాలంటూ సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. టపాసుల దుకాణాల ఏర్పాటు, విక్రయాలపై జేసీ గురువారం తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. డివిజన్, మండల స్థాయిలో అధికారులతో సమావేశాలు నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలను తెలియజేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, శాంతి భద్రతల విభాగం సూపరింటెండెంట్ వసంతలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

27న టీటీసీ థియరీ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: కలెక్టరేట్ సమీపంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో ఈ నెల 27న మూడు విడతల్లో టీటీసీ లోయర్‌గ్రేడ్ థియరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఈఓ బి.వరలక్ష్మి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. హాల్‌టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షకేంద్రానికి చేరుకోవాలి.

యువకుడి ఆత్మహత్య

పామిడి: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని సంతమార్కెట్ వీధిలో నివాసముంటున్న బోయ సుంకన్న కుమారుడు ఓబులేసు (26) మద్యానికి బానిసయ్యాడు. ఆయనలో మార్పు రాకపోవడంతో విసుగు చెందిన భార్య ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఓబులేసు... గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మట్కా కింగ్‌పిన్ అరెస్ట్

తాడిపత్రి అర్బన్: గుట్టుగా మట్కా నిర్వహిస్తున్న కింగ్ పిన్ చాంద్‌బాషాను పోలీసులు బుధవారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. అందిన పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టిన సమయంలో రూ.3లక్షల నగదు, మట్కా పట్టీలతో చాంద్‌బాషా పట్టుబడినట్లు అర్బన్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

ముడుపులిచ్చుకో.. మట్టి తవ్వుకో!

- జిల్లాలో జోరుగా గ్రావెల్ అక్రమ రవాణా
- వెంచర్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనం
- లీజుదారుల్లో ఆందోళన
- అక్రమ రవాణా వాస్తవమేనని అంగీకరిస్తున్న గనుల శాఖ అధికారి
- సిబ్బంది కొరతతో నివారించ లేకపోతున్నామంటూ బుకాయింపు


• జేసీబీతో మట్టిని తవ్వి తరలిస్తున్న ఈ చిత్రం కూడేరు మండల కేంద్రం సమీపంలోని కొండ గుట్ట వద్ద తీసింది. ఇక్కడ ఎలాంటి లీజు అనుమతులు లేకుండానే స్థానిక టీడీపీ నాయకులు మట్టిని తవ్వి టిప్పర్లతో వెంచర్లకు తరలిస్తున్నారు. టిప్పరుకు రూ.10 వేల చొప్పున నిత్యం వందల లోడ్ల మట్టిని తోలుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని స్థానికులు గనులశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం మాత్రం కనిపించడం లేదు.


• ఆత్మకూరు మండలం వడ్డుపల్లి సమీపంలో పదుల సంఖ్యలో వెంచర్లు వెలిశాయి. వాటికి అవసరమైన ఎర్రమట్టిని ఓ టీడీపీ మండలస్థాయి నాయకుడు అక్రమంగా తరలిస్తున్నాడు. గ్రామ సమీపంలోని గుట్ట నుంచి నిత్యం మట్టిని తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ విషయంపై రెవెన్యూ, గనులశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన ఏమాత్రం ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు.

అనంతపురం టౌన్: రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అనంతపురం పరిసరాలతోపాటు నగరం నుంచి ఆత్మకూరు, కూడేరు మండల కేంద్రాల వరకు రియల్టర్లు వెంచర్లు వేస్తున్నారు. ఈ క్రమంలో భూమి చదును చేసేందుకు పెద్ద ఎత్తున ఎర్రమట్టి (గ్రావెల్) అవసరం ఉంటుంది. అనుమతులున్న గ్రావెల్ లీజుదారుల నుంచి మట్టి కొనుగోలు చేయాలంటే పెద్ద మొత్తంలో సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఇదంతా లేకుండా నాయకులతో రియల్టర్లు కుమ్మక్కై ప్రభుత్వ భూములు, కొండ గుట్టల నుంచి ఎర్రమట్టిని తవ్వేసి వెంచర్లకు తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు.

గనులశాఖ ఉద్యోగుల అండ..

జిల్లా వ్యాప్తంగా ఎర్ర మట్టి రవాణా జోరుగా సాగుతున్న గనులశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గనుల శాఖ కార్యాలయంలో పని చేస్తున్న కొందరు ఉద్యోగుల కనుసన్నల్లోనే ఈ అక్రమాలు సాగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. కూడేరు మండల కేంద్రంలోని సంగమేశ్వర స్వామి దేవాలయం సమీపంలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారని రెండు రోజులుగా ఫిర్యాదు చేస్తే ఒక్క అధికారి కూడా అటు వైపు రాలేదని స్థానికులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. ఓ గనుల శాఖ అధికారి తమ ఫోన్ నంబర్లను బ్లాక్ లిస్టులో పెట్టి అక్రమార్కులను ప్రోత్సహిస్తున్నారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

లీజుదారుల ఫిర్యాదులు..

అక్రమంగా మట్టి తరలిస్తుంటే అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని గ్రావెల్ లీజుదారులు వాపోతున్నారు. రూ.లక్షల్లో ఫీజు చెల్లించి అనుమతులు తీసుకున్న తమకు ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోతోందంటున్నారు. లీజులను రద్దు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో జరుగుతున్న అక్రమ మట్టి రవాణాపై గనుల శాఖ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేసేందుకు లీజుదారులు సన్నద్ధమైనట్లు తెలిసింది.

విజిలెన్స్‌ను రప్పిస్తున్నాం

అక్రమంగా మట్టి రవాణా జరుగుతున్న విషయం వాస్తవమే. సిబ్బంది కొరతతో దాడులు చేయలేకపోతున్నాం. జిల్లాలో ప్రత్యేకంగా గనులశాఖ విజిలెన్స్‌ను ఏర్పాటు చేసి సిబ్బందిని కేటాయించాలని ఉన్నతాధికారులను కోరాం. కర్నూలు నుంచి ప్రత్యేక విజిలెన్స్ బృందం రెండు రోజుల్లో జిల్లాకు రానుంది. వారు వస్తే విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను అడ్డుకుంటాం.

– గంజి వెంకటేశ్వర్లు, గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్

29, 30 తేదీల్లో సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్

అనంతపురం: అఖిల భారత సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్–2024లో భాగంగా ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్‌కే షఫీ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల సివిల్ సర్వీస్ మహిళా, పురుష ఉద్యోగులకు 19 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. 29న అనంతపురంలోని అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, యోగా, చెస్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ పోటీలు ఉంటాయి. అనంతపురంలోని ఎస్‌ఆర్ స్టేడియంలో క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, అథ్లెటిక్స్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నారు. 30న ప్రసన్నాయపల్లిలో స్విమ్మింగ్ పోటీలు, ఆర్డీటీ స్టేడియంలో లాన్ టెన్నిస్ జరుగుతాయి. ప్రతిభ కనబరిచిన వారిని నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకూ విజయవాడ వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఆసక్తి ఉన్న ఉద్యోగులు తమ శాఖాధిపతి ధ్రువీకరణ పత్రాలు పొంది ఈ నెల 28లోపు అనంతపురంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సమర్పించి, పేర్లు నమోదు చేసుకోవాలి.

యువకుడి బలవన్మరణం

గుడిబండ: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం ఎస్.రాయాపురం గ్రామానికి చెందిన సిద్దప్ప, లక్ష్మమ్మ దంపతులకు నలుగురు కుమారులు ఉన్నారు. వీరిలో రామకృష్ణ(35) అనే కుమారుడు దీర్ఘకాలిక జబ్బులతో సతమతమవుతుండడంతో పెళ్లి కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన గురువారం తెల్లవారుజామున పశువులు కొట్టంలో ఇనుప దూలానికి పలుపు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

కబళిస్తున్న 'ముద్ద' వ్యాధి

- 2022లో అలజడి
- మళ్లీ పాడి పశువుల్లో కనిపిస్తున్న వ్యాధి లక్షణాలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రమాదకరమైన ముద్దచర్మవ్యాధి (లంపీస్కిన్ డిసీజెస్–ఎల్‌ఎస్‌డీ) పాడి పశువులను కబళిస్తోంది. ఇప్పటికే అక్కడక్కడ పాడి ఆవులు, దూడల శరీరాలపై పొక్కులు, పుండ్లు, బుడిపెలు ఏర్పడినట్లు రైతులు చెబుతున్నారు. అయితే వ్యాధి నివారణపై పశుశాఖ అధికారులు ఇంకా దృష్టి సారించినట్లు కనబడటం లేదు.

వ్యాధి లక్షణాలు, నివారణ

ముద్దచర్మ వ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరంతో బాధపడుతుంటాయి. మేత మేయకపోవడం, పాడి, పునరుత్పత్తి తగ్గిపోవడం, చర్మం మీద పొక్కులు ఏర్పడటం, నోరు, ముక్కు నుంచి చొంగ కారడం, గడ్డలు పగిలి రక్తం కారడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. దోమలు, ఈగలు, జోరీగలు, పిడుదులు లాంటి రక్తాన్ని పీల్చే పురుగులు కుట్టడం వల్ల ఒక పశువు నుంచి మరొక పశువుకు వ్యాధి వ్యాపిస్తుంది. లక్షణాలు కనిపించిన పశువు లేదా గేదెను వేరు చేసి దానికి రాగి గంజి, పచ్చిమేత ఇవ్వాలి. గుప్పెడు కుప్పింటాకు ఆకులు, గుప్పెడు వేపాకు, గుప్పెడు గోరింటాకు, గుప్పెడు తులసి ఆకులు, రెండు వెల్లుల్లి రెమ్మలు, 20 గ్రాముల పసుపు కలిపి ముద్దగా నూరి 500 గ్రాముల కొబ్బరి నూనెలో మరిగించి చల్లార్చిన తర్వాత పశువు శరీరానికి లేపనంగా పూసినా ఫలితం ఉంటుంది. అలాగే 10 తమలపాకులు, 10 గ్రాముల నల్లమిరియాలు, 10 గ్రాముల సాధారణ ఉప్పును ముద్దగా చేసి బెల్లంలో కలిపి రోజుకు మూడు సార్లు తినిపించినా నివారణ సులభమని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.


ముద్దచర్మ వ్యాధితో బాధపడుతున్న దూడ

2022లో కబళించిన వ్యాధి

2022లో ఈ వ్యాధి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పశువులను కబళించి పాడి రైతులను తీవ్ర గందరగోళానికి గురి చేసింది. అప్పట్లో జిల్లా పాడి రైతులనూ ఈ వ్యాధి భయపెట్టింది. అయితే అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం, పశుసంవర్ధకశాఖ అధికారులు తక్షణమే అప్రమత్తమై వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు తీసుకున్నారు. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా 10 వరకు పాడి పశువులు మృత్యువాత పడ్డాయి. 2022లో ఐదారు నెలల పాటు మార్కెట్ యార్డులు, మరికొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న పశువుల సంతలనూ బంద్ చేయించారు. ఆవులు, గేదెల క్రయ విక్రయాలు, రవాణాను బాగా కట్టడి చేశారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచారు. సరిహద్దు మండలాల పరిధిలో లక్ష వరకు పశువులు, గేదెలకు ముందు జాగ్రత్తగా గోట్‌ఫాక్స్ వ్యాక్సినేషన్ ఉచితంగా ఇవ్వడంతో తగ్గుముఖం పట్టింది. దీంతో రెండు నెలల్లోనే అదుపులోకి వచ్చింది. తాజాగా మళ్లీ అక్కడక్కడ వ్యాధి లక్షణాలు కనిపిస్తుండటంతో పాడి రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

యువ న్యాయవాది ఆత్మహత్య

అనంతపురం: ఉద్యోగాన్వేషణలో విసిగిపోయిన ఓ యువ న్యాయవాది జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంది. అనంతపురం రెండో పట్టణ ఎస్‌ఐ రుష్యేంద్రబాబు తెలిపిన మేరకు... శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం సిద్ధరాంపురం గ్రామానికి చెందిన జి.లాలూసాహెబ్‌కు ముగ్గురు కుమార్తెలు కాగా, వారి చదువుల కోసమని రెండేళ్ల క్రితం అనంతపురానికి వలస వచ్చి కోర్టు రోడ్డులోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. పెద్ద కుమార్తె రుక్సానా (27) అనంతపురం జిల్లా కోర్టులో జూనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. సీనియర్ న్యాయవాది ఎల్. ప్రభాకర్‌రెడ్డి వద్ద ప్రాక్టీస్ చేస్తున్న ఆమె అనంతపురం న్యాయవాదుల బార్ అసోసియేషన్‌లో క్రియాశీల సభ్యురాలిగా ఉన్నారు. రెండో కుమార్తె ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా, మూడో కుమార్తె అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ఈ క్రమంలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న రుక్సానా ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరం చేస్తూ వచ్చారు. అయినా ఏ ఒక్క అవకాశమూ రాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె... నెల రోజులుగా తీవ్ర మానసిక వేదనతో కోర్టుకు కూడా వెళ్లకుండా ఇంటి పట్టునే ఉంటూ వచ్చారు. ఈ క్రమంలోనే గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనపై అనంతపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఎస్కేయూ క్యాంపస్ కళాశాలలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన రుక్సానాకు గత ప్రభుత్వంలో నెలకు రూ.5 వేలు స్టయిఫండ్ అందేదని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత స్టయిఫండ్ అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ వచ్చినట్లుగా సమాచారం. వృత్తిలో నిలదొక్కుకునే వరకూ జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వ చేయూత అవసరమని యువ న్యాయవాదులు డిమాండ్ చేశారు.


రుక్సానా (ఫైల్)

'దుర్గం' ఆర్టీఓగా రమేష్



అనంతపురం సెంట్రల్: కళ్యాణదుర్గం రవాణాశాఖ అధికారి(ఆర్టీఓ)గా ఎస్. రమేష్ నియమితులయ్యారు. గతంలో ఈయన అనంతపురం ఎంవీఐగా పనిచేశారు. పదోన్నతిపై కర్నూలు ఆర్టీఓగా బదిలీ అయ్యారు. అక్కడి నుంచి రంపచోడవరం వెళ్లారు. ఈ క్రమంలోనే ఆన్‌డ్యూటీ(ఓడీ)పై కళ్యాణదుర్గం ఆర్టీఓగా నియమించారు. గురువారం ఉప రవాణా కమిషనర్ వీర్రాజును మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. రమేష్ మాట్లాడుతూ కళ్యాణదుర్గంకు మొదటి ఆర్టీఓగా నియమించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యాలయ నిర్మాణం తన ముందున్న కర్తవ్యమని, అలాగే రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి

యాడికి: మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ విజయలక్ష్మి మాట్లాడుతూ మండల వార్షిక ఆదాయం రూ. 9.5 కోట్లు రావాల్సి ఉండగా ఎన్నికల సందర్భంగా కేవలం 40 శాతం ఆదాయం వచ్చిందన్నారు. స్టాంపు వెండర్లు తమ శాఖ స్టాంపులు విక్రయించినందుకు కమీషన్ వస్తుందన్నారు. నాన్ జ్యుడీషియల్ స్టాంపులను అధిక ధరలకు విక్రయించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. అలాంటి వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో యాడికి మండల సబ్ రిజిస్ట్రార్ జాఫర్ సాధిక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రమ్మ ఆలయంలో చోరీ

గుత్తి రూరల్: మండలంలోని గాజులపల్లి గ్రామ శివారున ఉన్న చంద్రమ్మ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ తలుపుల తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు రెండు హుండీలను ధ్వంసం చేసి అందులోని సుమారు రూ.40వేలను అపహరించారు. గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న అర్చకుడు విషయాన్ని గుర్తించి గ్రామస్తుల ద్వారా సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చోరీ సమయంలో దుండగులు వినియోగించిన గ్లౌజ్‌లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సౌత్‌జోన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్కేయూ జట్టు ఎంపిక

అనంతపురం: ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు తమిళనాడులోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వేదికగా జరిగే అంతర వర్సిటీ సౌత్‌జోన్ బాల్‌బ్యాడ్మింటన్ (మెన్స్) టోర్నీలో ప్రాతినిథ్యం వహించే ఎస్కేయూ జట్టును గురువారం ఎంపిక చేశారు. ఈ మేరకు ఎస్కేయూ క్రీడా కార్యదర్శి డాక్టర్ బి.జెస్సీ తెలిపారు. ఎంపికైన వారిలో అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలకు చెందిన గాజుల మహమ్మద్ మసూద్‌వలి, పి.ఉదయ్ నరసింహ, ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థి ఈ.షాలోమ్, పీవీకేకే విద్యార్థి వై.పవన్, ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థి వై.గౌతమ్ ఉన్నారు. జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులను రెక్టార్ జి. వెంకటనాయుడు అభినందించారు.


ఎంపికైన క్రీడాకారులతో ఎస్కేయూ రెక్టార్ జి.వెంకటనాయుడు

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

గార్లదిన్నె: పోక్సో కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలంలోని ఓ మైనర్ బాలికతో పరిచయం పెంచుకున్న మర్తాడు గ్రామానికి చెందిన షేక్ గౌస్‌పీరా... ఇటీవల తనను పెళ్లి చేసుకోవాలంటూ వేధించసాగాడు. విషయం తెలుసుకున్న బాలిక బంధువులు ఈ నెల 17న మర్తాడుకు వెళ్లి గౌస్‌పీరాను మందలించారు. ఆ సమయంలో కొడవలితో గౌస్‌పీరా దాడి చేయడంతో బాలిక బంధువులు ఇద్దరు గాయపడ్డారు. ఘటనపై క్షతగాత్రుడు బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు గౌస్‌పీరాపై పోలీసులు పోక్సో చట్టంతో పాటు, హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అక్రమ మద్యం కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష

రొద్దం: కర్ణాటక మద్యాన్ని అక్రమ తరలిస్తూ పట్టుబడిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ 2 లక్షల జరిమానా విధిస్తూ పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బొజ్జప్ప తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. 2020న జూన్‌లో పెనుకొండ మండలం మావటూరు గ్రామానికి చెందిన చిన్న అంజినప్ప అనే వ్యక్తి కర్ణాటక మద్యం తరలిస్తుండగా అప్పటి ఎస్‌ఐ వి.నారాయణ అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసులో వాదనలను ఏపీపీ శ్యామల వినిపించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బొజ్జప్ప తీర్పు వెలువరించారు.

త్వరలో ఆర్‌యూబీ పనులు

గుంతకల్లు: స్థానిక ధర్మవరం రైల్వే గేట్ ప్రాంతంలో త్వరలో ఆర్‌యూబీ పనులు ప్రారంభించనున్నట్లు ఏడీఆర్‌ఎం యు.సుధాకర్ తెలిపారు. ఏపీ రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్, జోనల్ పరిధిలోని డీఆర్‌ఎంలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రైల్వే ప్రాజెక్టులు, అమరావతికి కనెక్టివిటీ రైలు మార్గ పనులు, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం విలేకరులతో ఏడీఆర్‌ఎం సుధాకర్ మాట్లాడుతూ... గుంతకల్లులోని ధర్మవరం రైల్వేగేట్‌ను తొలిగించి ఆర్‌యూబీ పనులను చేపట్టడానికి మరోసారి క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టనున్నామన్నారు. ప్లాన్‌లో భాగంగా ఆర్‌యూబీ ఎత్తును పెంచడంతో పాటు మరికొన్ని మార్పులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే గుత్తి–పెండేకల్లు 29 కి.మీ.ల డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులకు దాదాపు రూ.350 కోట్లతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


వీసీలో మాట్లాడుతున్న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

యాడికి/పామిడి: పంటల సాగులో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి సూచించారు. గురువారం యాడికి మండలంలోని రాయల చెరువు, పెద్దవడుగూరు మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతు సేవా కేంద్రం సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతుల పొలాలను సందర్శించి, తెగులు సోకిన పంటలను ఫొటో తీసి అప్లోడ్ చేస్తే .. పంటకు సంబంధించిన సస్యరక్షణ చర్యల గురించి అధికారులు రైతులకు తెలియజేస్తారన్నారు. సీ యాప్ ఎలా పని చేస్తుందో రైతు సేవా సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు, యాడికి మండలాల ఏఈఓలు ప్రసాద్, రజని, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పామిడి పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో పంటల సమగ్ర సస్య రక్షణపై వ్యవసాయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి, వేరుశనగ, కంది తదితర పంటలకు ఆశించే చీడపీడలు, పురుగుల వల్ల కలిగే నష్టాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను ఆయన మానిటర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీ లీనా వసుంధర, ఏఈఓ శ్రీనివాసరావ్, డీఆర్‌సీ ఏఈఓ ప్రసాద్, సిబ్బంది శ్రీకాంత్, రామాంజనేయులు, చిరంజీవి, ఆదినారాయణ, చందన తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆత్మ పీడీ మద్దిలేటి

ఖాకీల అదుపులో నలుగురు?

బత్తలపల్లి: కలకలం సృష్టించిన తుపాకీ కాల్పుల కేసులో రెండు ముఠాలకు చెందిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అనంతపురం – కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి మండలం రామాపురం కూడలిలో ఆదివారం ఉదయం దుండగులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ ఘటనను పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో విచారణ వేగవంతం చేశారు. కాల్పులు జరిపిన అనంతరం పారిపోతున్న రాయచోటి ప్రాంతానికి చెందిన ఓ షికారీ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విచారణలో దుండగుడు పలు ఆసక్తికర విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. వీటి ఆధారంగా సీఐ ప్రభాకర్ నేతృత్వంలో ఓ బృందం, ఎస్‌ఐ సోమశేఖర్ నేతృత్వంలో మరో బృందంగా విడిపోయి దుండగుల కోసం హైదరాబాద్, రాయచోటి ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో మరో ముగ్గురుని అదుపులోకి తీసుకుని, రహస్య ప్రదేశంలో విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

బంగారం అపహరణకేనా?

పోలీసుల అదుపులో ఉన్న షికారీలు పలు ఆసక్తికర విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. తాము పునాదులు తవ్వుతుండగా బంగారం లభ్యమైందని, దీనిని తక్కువ ధరకే ఇస్తామంటూ హైదరాబాద్‌కు చెందిన వారితో షికారీలు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఈ మొత్తం ప్రక్రియ సెల్‌ఫోన్ ద్వారానే జరిగింది. అనంతరం ఆదివారం హైదరాబాద్‌కు చెందిన వారు నగదు అప్పగించి బంగారం స్వాధీనం చేసుకునేందుకు వచ్చారు. అంతకు ముందే హైదరాబాద్ వాసులు మరో కారులో కొందరిని పోలీసుల తరహాల అక్కడకు చేరుకుని మాటు వేసేలా పక్కా ప్రణాళిక రచించారు. కాసేపటికి అక్కడకు ద్విచక్ర వాహనంలో చేరుకున్న షికారీ యువకులు బంగారం ఇచ్చి డబ్బు మార్చుకునే సమయంలో పోలీసుల డ్రస్సుల్లో ఉన్న వారు అక్కడకు చేరుకోవడం, ఎయిర్ గన్లతో కాల్పులు జరపడం వంటి చర్యలకు పాల్పడ్డారు. దీంతో షికారీలు భయపడి తమ వద్ద ఉన్న మూటను విసిరేసి ద్విచక్రవాహనాల్లో పారిపోయారు. అనంతరం ఆ మూటను హైదరాబాద్ వాసులు తీసుకుని ఏమీ తెలియనట్టుగా కారులో ఉడాయించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. షికారీల్లో ఒకరు చిత్రావతి నది వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్నట్లుగా పసిగట్టి అదుపులోకి తీసుకుని విచారణ వేగవంతం చేశారు. సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమైన కారు నెంబర్ల ఆధారంగా యజమానికి ఫోన్ చేసి వివరాలు సేకరించారు. కాగా, బంగారం అపహరణకే ఇంత హైడ్రామా నడిపినట్లుగా తెలుస్తోంది.

క్లుప్తంగా

నీటి సమస్యకు పరిష్కారం



పంపనూరు తండా వద్ద బోరుకు మరమ్మతులు చేయడంతో సమృద్ధిగా వస్తున్న నీరు

ఆత్మకూరు: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని గొరిదిండ్ల, పంపనూరు తండాల్లో బోర్లు మరమ్మతులకు గురి కావడంతో తాగునీటి సమస్య తలెత్తింది. ప్రజలు ఇబ్బందులను తెలుసుకున్న సర్పంచులు ఎర్రిస్వామి, నాగరత్నమ్మ వెంటనే స్పందించారు. బోర్లకు మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు. బోరు వద్దకు వెళ్లేందుకు వీలుగా పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి జేసీబీతో దారి కూడా ఏర్పాటు చేయించారు. అదే విధంగా గొరిదిండ్లలో బోరు మరమ్మతులు చేయించి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

బస్సులు జాగ్రత్తగా నడపండి

- ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్.ఆదోని

అనంతపురం క్రైం: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్రైవర్లు బస్సులను అత్యంత జాగ్రత్తగా నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్.ఆదోని తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన రీజియన్ పరిధిలోని అన్ని డిపోల మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. పలు సూచనలు, సలహాలు చేశారు. బ్రేక్‌డౌన్‌లు తగ్గించి బస్సులను కండీషన్‌లో ఉంచాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. సమయపాలన తప్పక పాటించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. కార్తీకమాసం దృష్టిలో ఉంచుకుని ప్రతి డిపో మేనేజరు బస్సులను శివక్షేత్రాలకు నడపాలన్నారు. ప్రయాణికులు చిన్న అసౌకర్యం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

చర్చిలో భోజన వసతి

అనంతపురం కల్చరల్: పండమేరు వాగు ఉధృతితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు పెద్దవంక సమీపంలోని గ్లోరియస్ చర్చిలో గురువారం భోజన వసతి కల్పించారు. గ్లోరియస్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ శేఖర్ బాబు ఆధ్వర్యంలో నిస్సహాయులకు ఉదయం టిఫెన్, మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద ఇబ్బందులు తొలిగే వరకు సాయమందిస్తామని తెలిపారు.

పోలీసు పిల్లలకు వ్యాసరచన పోటీలు



సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం: జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసు కాన్ఫరెన్స్ హాలులో గురువారం పోలీసు పిల్లలకు సెమినార్లు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర' అనే అంశంపై పోటీలు జరిగాయి. వ్యాసరచన, సెమినార్లలో ప్రతిభ చూపిన పోలీసు పిల్లలను గుర్తించి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు రమేష్ నాయక్, మగ్బూల్, ముస్తఫా, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్విజ్ పోటీలు

చెన్నేకొత్తపల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలను కొనియాడారు. పోలీస్ స్టేషన్‌లోని వైర్‌లెస్ సెట్ వినియోగం, ఆయుధాల ఉపయోగాలపై వివరించారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

రూ.5 వేలు కొట్టు.. పట్టా పట్టు!

- ఉప్పరపల్లి పొలంలో ఇంటి స్థలాలిప్పిస్తామంటూ మోసం
- అధికారుల సంతకాల ఫోర్జరీతో నకిలీ పట్టాలు
- 189 మంది బాధితుల నుంచి రూ.5 వేల చొప్పున వసూలు
- ఒరిజినల్ పట్టాల కోసం రూ.30 నుంచి 50 వేలు డిమాండ్
- తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేసిన బాధితులు
- నెల రోజులవుతున్నా పట్టించుకోని పోలీసులు



అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం



అక్రమార్కులు అందజేసిన నకిలీ పట్టా

రాప్తాడురూరల్: పేదలకు ఇంటిస్థలాల ఆశ చూపిస్తూ కొందరు అక్రమార్కులు దోపిడీకి తెర తీస్తున్నారు. అనంతపురం రూరల్ మండలంలో భూముల విలువ అమాంతంగా పెరిగిపోవడంతో కుల సంఘాలు, ప్రజా సంఘాల ముసుగులో కొందరు సరికొత్త వ్యాపారానికి తెర తీశారు. నగర చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు, వంక పొరంబోకు స్థలాల్లో ఇంటి పట్టాలిప్పిస్తామని పేదలకు ఆశ చూపించి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఏకంగా రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేస్తూ నకిలీ పట్టాలు తయారు చేస్తున్నారు. ఇది ఎక్కడో కాదు స్వయంగా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఉప్పరపల్లి పంచాయతీలో సాగుతున్న దందా. రూ.5 వేలు వసూలు చేసి తమకు నకిలీ పట్టాలిచ్చారని గుర్తించిన బాధితులు లబోదిబోమంటూ తహసీల్దార్ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు..

ఉప్పరపల్లి పొలం 194–8, 215 సర్వే నంబర్లలో ఇంటి పట్టాలిప్పిస్తామంటూ కురుగుంట గ్రామానికి చెందిన ఎస్.నాగభూషణం, చామలూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు, ఈడిగ వెంకటేష్ 8 నెలల కిందట 189 మందితో ఒక్కొక్కరితో రూ.5 వేలు వసూలు చేశారంటూ గత నెల 27న అనంతపురం రూరల్ తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అందరికీ పట్టాలు కూడా ఇచ్చారన్నారు. పట్టాలో ఆర్సీ నంబర్, తహసీల్దార్ సీలు, సంతకం ఉండటంతో ఒరిజనల్ పట్టాలని భావించామన్నారు. కొందరు రెవెన్యూ అధికారులను కలిస్తే ఇవన్నీ డూప్లికేట్ పట్టాలని చెప్పారని వాపోయారు. దీనిపై నాగభూషణం, రామంజనేయులు, వెంకటేష్‌ను నిలదీస్తే ఒక్కొక్కరూ రూ.30 నుంచి రూ.50 వేలు ఇస్తే ఒరిజల్ పట్టా ఇస్తామంటున్నారని తెలిపారు. తాము ఇచ్చిన డబ్బులు వాపసు ఇవ్వాలని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అవన్నీ బోగస్ పట్టాలే..

బాధితుల వద్ద ఉన్న పట్టాలను పరిశీలించిన తహసీల్దార్ మోహన్‌కుమార్ అవన్నీ బోగస్ పట్టాలుగా తేల్చారు. అమాయక ప్రజలను ఇంటి స్థలాల పేరుతో మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ స్వయంగా అనంతపురం డీఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఎస్పీకి కూడా సమస్యను తెలిపారు. వెంటనే పరిశీలించి పేదలను మోసగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఈ క్రమంలో అనంతపురం రూరల్ పీఎస్‌లోనూ తహసీల్దార్ రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. డీఎస్పీని కలిసి దాదాపు నెలరోజులవుతున్నా ఇప్పటిదాకా కనీస చర్యలు లేవని రెవెన్యూ సిబ్బంది వాపోతున్నారు.

క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశాం..

ఉప్పరపల్లి పొలం 194–8, 215 సర్వే నంబర్లలో ఇంటి స్థలాల కోసమంటూ కొందరు నకిలీ పట్టాలిచ్చి మోసగించడంపై బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపాం. అవన్నీ బోగస్ పట్టాలే. పేదలను మోసగించిన వారిపై కేసులు నమోదు చేయాలంటూ రూరల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాం. విచారించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. నకిలీ పట్టాలు తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. బాధితులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌కుమార్, తహసీల్దార్

హిందీ భాషను సబ్జెక్టుగా చేర్చాలి



విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హిందీ ప్రచారసభ ప్రతినిధులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి 1వ తరగతి నుంచి హిందీని సబ్జెక్టుగా చేర్చాలని హిందీ ప్రచారసభ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి, ఏపీ అధ్యక్షుడు సీఎల్ నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గైబువల్లి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు–విద్యార్థి నిష్పత్తి ఆధారంగా తక్కిన సబ్జెక్టుల టీచర్లకు సమానంగా ఉండేలా ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. మోడల్ స్కూళ్లలోనూ ఇప్పటిదాకా ఒక్క పీజీటీ హిందీ పోస్టునూ భర్తీ చేయలేదన్నారు. చాలా సంక్షేమ స్కూళ్లలో పీజీటీ హిందీ పోస్టులు లేవని తెలిపారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో హిందీ అధ్యాపకులు లేనందున హిందీని విద్యార్థులు చదివే అవకాశం లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. హిందీ పండిత శిక్షణ కళాశాల ప్రవేశాల కోసం ఎల్పీ సెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. హిందీ ప్రచారసభ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే కళాశాలలకు ప్రత్యేక అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అంధుల ఆదర్శ వివాహం



వధూవరులతో మేయర్ వసీం తదితరులు

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన లోకేష్, తెలంగాణ రాష్ట్రానికి చెందిన రాథోడ్ సునీత అనే అంధులు గురువారం అనంతలో వివాహం చేసుకున్నారు. సాయిట్రస్టు ఆధ్వర్యంలో తపోవనంలోని చిన్మయ జగదీశ్వరాలయంలో సంప్రదాయ పద్ధతిలో వివాహం జరిపించారు. స్వామి ఆత్మవిదానంద సరస్వతీతో పాటూ ఎంపీ లక్ష్మీనారాయణ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, బీజేపీ నాయకులు వేంకటేశ్వరరెడ్డి తదితరులు ట్రస్టు నేతృత్వంలో సాగుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. మతం, కులం కన్నా మానవత్వం గొప్పదని అవగాహన లేకపోవడంతోనే ఎంతో మంది విడాకులు తీసుకుంటున్నారని మేయర్ వసీం అన్నారు. ఈ విధంగా అర్థం చేసుకున్న దాదాపు 102 మంది నిరుపేద, అంధుల జంటలను ఏకం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. అదేవిధంగా ఎటువంటి సంభావన తీసుకుకోకుండా వివాహం జరిపించిన వేదపండితులు దేవరకొండ బాలాజీని అభినందించారు. మధ్యాహ్నం నారాయణసేవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆవోపా జిల్లా అధ్యక్షుడు జయంతి శ్రీనివాసులు, వలీస్వామి ఆశ్రమ నిర్వాహకులు జయచంద్రారెడ్డి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ సంస్థ అధ్యక్షుడు విజయభాస్కర్, విజువల్లీ చాలెంజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జలంధర్, రాఘవేంద్ర, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఆత్మకూరు: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థి నాగను అభినందించిన ఉపాధ్యాయులు

ఆత్మకూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. మండలంలోని సనప, ఆత్మకూరు, ముట్టాల, తలుపూరు ఉన్నత పాఠశాలల నుంచి పలువురు విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాల పీడీలు తెలిపారు. హాకీ అండర్–19 విభాగంలో సనప ఉన్నత పాఠశాలకు చెందిన నంద కిషోర్, ప్రతాప్, పవన్, బాలికల విభాగంలో నవనీత, శైలజ, రజిత, జోత్స్న, భారతి, సమయంత, మానుష, అండర్–14 విభాగంలో సికిందర్, బాలికలల్లో సాయి కీర్తన, భారతి, యామిని, అండర్–17 విభాగంలో హర్ష, సంధ్య, షర్మిల ఎంపికైనట్లు పీడీ నాగరాజు తెలిపారు. తలుపూరుకు చెందిన నాగ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ జగదీష్ వెల్లడించారు. ఫుట్‌బాల్ అండర్–17 విభాగంలో ఆత్మకూరుకు చెందిన యశ్వంత్ కుమార్, అథ్లెటిక్స్ అండర్–17 షాట్‌పుట్‌లో సరస్వతి, ఫుట్‌బాల్ అండర్–14 విభాగంలో విష్ణుప్రణవి ఎంపికైనట్లు పీఈటీ గోవర్ధన్ పేర్కొన్నారు. కబడ్డీలో హారిక, స్కిప్పింగ్‌లో సుస్మిత, లాంగ్‌జంప్‌లో ఐశ్వర్య, హైజంప్‌లో సంధ్య, ట్రిపుట్ జంప్‌లో సంధ్య, హైజంప్‌లో లావణ్య, హై జంప్‌లో సంధ్య ఎంపికైనట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ లీమారోజ్ తెలిపారు.



రాప్తాడు: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాప్తాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు త్రో బాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–19 విభాగం త్రోబాల్ పోటీల్లో నవ్యశ్రీ, కీర్తన, భవిత, హేమలత, దుర్గ, రేవంత్, అండర్–19 విభాగంలో ఖోఖో తనూజ, అండర్–17 విభాగంలో హ్యాండ్ బాల్ జట్టుకు లోక రాజు, అండర్–14 విభాగంలో హ్యాండ్ బాల్ పోటీల్లో చాణక్య సత్తా చాటారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరుపున ఎంపికైన విద్యార్థులు ప్రాతినిత్యం వహించనున్నారు. ప్రతిభ చాటిని విద్యార్థులను పీడీలు రాజశేఖర్ రెడ్డి, ఎన్.కేశవ మూర్తి, హెచ్ఎం సాంబశివ అభినందించారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



హెడ్‌కానిస్టేబుల్ నరసింహమూర్తి మృతదేహానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

అనంతపురం: గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న హెడ్‌కానిస్టేబుల్ నరసింహమూర్తి అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం కంబదూరులో హెడ్‌కానిస్టేబుల్ నరసింహమూర్తి అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ నరసింహమూర్తి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల్లో పుట్లూరు ఎస్ఐ హేమాద్రి, ఏఎస్ఐ రాజశేఖర్, కంబదూరు ఏఎస్ఐ ఓబుళపతి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, లక్ష్మీనారాయణ, మృతుడి కుటుంబ సభ్యులు, బ్యాచ్‌మేట్లు, తదితరులు పాల్గొన్నారు.

'చార్జింగ్ స్టేషన్‌గా మార్చేశారు'



బళ్లారి రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఎలక్ట్రికల్ వాహనానికి చార్జింగ్ పెట్టిన దృశ్యం

విద్యుత్ మీటర్లను వాడి విద్యుత్ సంస్థ అభివృద్ధికి విద్యుత్ వినియోగదారులు కృషి చేయాలని నిత్యం తెలిపే అధికారులే విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. బళ్లారి రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ విభాగానికి సంబంధించిన సెక్షన్‌లో పలువురు విద్యుత్ ఉద్యోగులతో పాటు తమ బంధువులకు చెందిన విద్యుత్ వాహనాలకు చార్జింగ్ పెడుతూ ట్రాన్స్‌ఫార్మర్ సెక్షన్‌ను కాస్తా.. చార్జింగ్ స్టేషన్‌గా మార్చేశారు. రోజూ ఏదో ఒక ద్విచక్ర వాహనానికి చార్జింగ్ పెడుతున్నారు. ఇక్కడ చార్జింగ్ చేస్తే ఎలాంటి విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన పని ఉండదంటూ యథేచ్ఛగా విద్యుత్ సంస్థ ఉద్యోగులే విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ సెక్షన్‌ను.. చార్జింగ్ స్టేషన్‌గా మార్చకుండా చూడాల్సిన అవసరం ఉంది.

– అనంతపురం టౌన్:

ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలి



సేఫ్టీ కిట్లను అందజేస్తున్న ఎస్ఈ సంపత్‌కుమార్

అనంతపురం టౌన్: విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ఉద్యోగులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ సూచించారు. గురువారం ఎస్ఈ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులకు సేఫ్టీ కిట్లు పంపిణీ చేశారు. చేతి గ్లౌజులు, హెల్మెట్, ఎర్త్ డిశ్చార్జింగ్ రాడ్‌తోపాటు సేఫ్టీ బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాకాలంలో ప్రతి ఉద్యోగి విధులకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలు ఎక్కి విద్యుత్ తీగలను సరి చేసే సమయంలో విద్యుత్ కిట్‌ను వినియోగించాలన్నారు. అజాగ్రత్తగా విద్యుత్ తీగలను తాకరాదన్నారు. అదే సమయంలో స్థానికంగా ఉండే విద్యుత్ వినియోగదారులకు సైతం విద్యుత్ ప్రమాణాలు పాటించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ జేవీ రమేష్, ఏడీ శ్రీనివాసులు, నగర పరిధిలోని ఏఈలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిని సర్వే చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు: అనంతపురం రూరల్ మండలంలోని ఉప్పరపల్లి జగనన్న లేఅవుట్‌లో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా సర్వే చేశారు. అనర్హులు ఎవరైనా ఉంటే వెంటనే క్యాన్సిల్ చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. గురువారం రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ పథకంపై నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉప్పరపల్లి జగనన్న లేఅవుట్‌లో ప్రతి ఇంటిని సర్వే చేసి ఎవరికి ఇళ్లు ఇచ్చారు? టౌన్‌లో వాళ్లకు ఇచ్చారా? అని విచారణ చేయాలన్నారు. ఆ కాలనీలో ఉప్పరపల్లి వాసులు లేకపోతే మొత్తం క్యాన్సిల్ చేద్దామన్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలో ఇళ్ల నిర్మాణాలపై విచారణ జరుగుతోందని తెలిపారు. అంతవరకూ జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకుంటున్న వారికి పైసా కూడా బిల్లు పెట్టవద్దని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీలు, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.

27న ఆర్ఎస్ఎస్ పథ సంచలన్

అనంతపురం కల్చరల్: ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) ఆరంభమై వందేళ్లు అవుతున్న సందర్భంగా ఈనెల 27న మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక జూనియర్ కాలేజ్ వద్ద భారీ ఎత్తున పథ సంచలన్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నగర సంఘచాలక్ తాళంకి లలితాప్రసాద్, చంద్రమౌళి వివరాలు వెల్లడించారు. దేశ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాగే ఆర్ఎస్ఎస్ ప్రత్యేక సమావేశాలతో పాటూ నగరవీధుల్లో సుశిక్షితులైన పథ సంచలన్ (రూట్ మార్చ్) నిర్వహిస్తారని పేర్కొన్నారు. అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని న్యామద్దెల సర్కిల్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, ద్విచక్ర వాహనంలో ముగ్గురు వెళ్లడం, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

● పాకలో క్యాంటీన్



కలెక్టరేట్‌లో క్యాంటీన్ రూమ్



కలెక్టరేట్‌లో గోడ పక్కన పాక కింద నిర్వహిస్తున్న క్యాంటీన్

కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా క్యాంటీన్ రూమ్ ఉన్నప్పటికీ పాకలోనే క్యాంటీన్ కొనసాగిస్తున్నారు. గతంలో క్యాంటీన్ భవనం పాతబడటంతో అప్పటి జిల్లా కలెక్టర్ గౌతమి మరమ్మతులు చేయించారు. సార్వత్రిక ఎన్నికల క్రమంలో క్యాంటీన్ భవనాన్ని జిల్లా ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ సెల్ కోసం వినియోగించారు. దీంతో నిర్వాహకులు కార్యాలయ ఆవరణలో పాక కింద క్యాంటీన్ ఏర్పాటు చేసుకున్నారు. ఎన్నికలు ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నా భవనాన్ని క్యాంటీన్ కోసం అప్పగించ లేదు. క్యాంటీన్ భవనాన్ని గోడౌన్ తరహాలో పాత చెక్క సామగ్రితో నింపేశారు. దీంతో చేసేది ఏమీ లేక నిర్వాహకులు పాక కిందనే క్యాంటీన్‌ను కొనసాగిస్తున్నారు. వర్షాలు వచ్చినప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కలెక్టరేట్ అధికారులు ఇప్పటికైనా స్పందించి రూమ్‌ను క్యాంటీన్‌కు కేటాయిస్తారో లేదో చూడాలి.

– అనంతపురం అర్బన్:

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక



ప్రతిభ కనబరిచిన నసనకోట విద్యార్థులు

రామగిరి: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో నసనకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్–17 విభాగం 90 కేజీల విభాగంలో ముద్దుకృష్ణ ఉత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించినట్లు ఆ పాఠశాల పీడీ చామంతి తెలిపారు. 73 కేజీల పోటీల్లో విజయరాజు రాణించి వెండి పతకం సాధించినట్లు పేర్కొన్నారు. నవంబర్ నెలలో జమ్మూలో జరిగే జాతీయస్థాయి జూడో పోటీలకు ముద్దుకృష్ణ ఎంపికైనట్లు వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ

కనగానపల్లి: ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థి నాగయశ్వంత్ ప్రతిభ కనబరిచాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 విభాగంలో విద్యార్థి 5వ స్థానంలో నిలిచాడని పాఠశాల పీడీ మాధవరాజులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రవికిరణ్, ఉపాధ్యాయులు విద్యార్థిని, పీడీని ప్రత్యేకంగా అభినందించారు.



● పుప్పొడి నేత
పరాగ మంజరి

పూల అందాలను చూసి మైమరచిపోవడం మనకు తెలిసిందే! వాటిలో దాగున్న పరాగ రేణువుల అందం చూస్తే... ప్రకృతి ఒడిలో మనకు తెలియని ఇన్ని అద్భుతాలు దాగున్నాయా అని ఆశ్చర్యపోవాల్సిందే! అత్యంత సంక్లిష్టంగా ఉండే ఆ పరాగ రేణువుల నిర్మాణపు అందాన్ని చూడటమే కాదు, వాటిని టెక్స్‌టైల్ డిజైన్స్‌లో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నది హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఎమ్మెస్సీ విద్యార్థిని శివాని నేత చిలుకూరి. అత్యంత సూక్ష్మంగా కనిపించే ఈ అద్భుతాలను 'పరాగ మంజరి'గా మనకు పరిచయం చేస్తున్నది. 'దేశానికి గుర్తింపు తెచ్చే లక్షలాది యునిక్ డిజైన్స్‌ని పరిచయం చేయబోతున్న ఆనందంలో ఉన్నాను' అంటున్న శివాని నేత తన ప్రాజెక్ట్ విశేషాలను ఇలా మన ముందుంచింది..

''పరాగ అంటే పుప్పొడి – మంజరి అంటే డిజైన్. సంస్కృతం నుంచి తీసుకున్న ఈ పదాలను మా ప్రాజెక్టుకు పెట్టాం. బీఎస్సీ అగ్రికల్చర్ చేయాలనుకుని, కుదరక బోటనీ సబ్జెక్ట్ తీసుకున్నాను. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ బోటనీ చేస్తున్నాను. నాకు డ్రాయింగ్ కూడా తెలుసు అని మా బోటనీ ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి సర్ నాకు ఈ డిజైనింగ్ టాపిక్ ఇచ్చారు. దానిని ఇలా మీ ముందుకు తీసుకు రాగలిగాను.

లక్షలాది మోడల్స్

పరాగ రేణువులను రెండు విధాలుగా మైక్రోస్కోప్ చేశాను. లైట్ మైక్రోస్కోపీలో ఫ్లవర్ స్ట్రక్చర్, సెమ్(స్కానింగ్ ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్)లో పుప్పొడి రేణువులను స్కాన్ చేశాను. భూమిపైన లక్షలాది మొక్కలు, వాటి పువ్వులు వేటికవి భిన్నంగా ఉంటాయి. ఇక వాటిలోని పరాగ రేణువులు మరింత భిన్నంగా ఉంటాయి. మందార, వేప, తులసి, తిప్పతీగ, తుమ్మ, అర్జున, ఉల్లి పాయ, కాకర, ఆరెంజ్, జొన్న, మొక్క జొన్న, ఖర్జూరం, దోస పువ్వు... ఇలా దాదాపు 70 రకాల పుప్పొడి రేణువులను స్కాన్ చేసి, ఆ స్కెలిటిన్ నుంచి మోటిఫ్స్‌ను వెలుగులోకి తీసుకువచ్చాను. ఈ అందమైన పరాగ రేణువుల నుంచి మోటిఫ్స్ డిజైన్స్‌గా తీసుకు రావడానికి నాలుగు నెలల సమయం పట్టింది.

పేటెంట్ హక్కు

ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్‌లోనే టెక్స్‌టైల్ ప్యాటర్న్‌ని తీసుకున్నాను. క్లాత్ మీదకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మాది నేత కుటుంబమే. నేను చేసిన ఈ ప్రింట్స్ క్లాత్స్ మీదకు తీసుకురావచ్చని నిర్ధారణ చేసుకున్నాం. కాటన్, పట్టు, సీకో మెటీరియల్ మీదకు మోటిఫ్స్ ప్రింట్స్ చేయచ్చు. నేతలోనూ డిజైన్స్ తీసుకోవచ్చు. ఎంబ్రాయిడరీ కూడా చేయచ్చు. మేం ముందు టీ షర్ట్ పైన ప్రింటింగ్



శివాని నేత

ప్రయత్నం చేశాం. ఇంకా మిగతా వాటి మీదకు ప్రింట్స్ చేయాలంటే టెక్స్‌టైల్ ఇండస్ట్రీ మద్దతు అవసరం అవుతుంది. బ్లాక్ ప్రింట్ చేయాలన్నా .. అందుకు తగిన వనరులన్నీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ముందుగా పేటెంట్ హక్కు పొందేవరకు వెళ్లింది. దీనిని ఒక స్టార్టప్‌గా త్వరలో ప్రారంభించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

టెక్స్‌టైల్ రంగం మద్దతుతో...

ప్రకృతిలో కళ్లకు కనిపించేవి లైట్ మైక్రోస్కోపిక్ ద్వారా నలభై వరకు పిక్చర్స్ తీసుకుంటే, స్టెమ్ ద్వారా మరికొన్ని సాధించాం. కంప్యూటర్‌లో వియానా దేశం నుంచి పోలెన్ గ్రెయిన్స్ స్కెలిటన్ స్ట్రక్చర్ నుంచి కొన్ని తీసుకున్నాం. మన దేశానికి వేల సంవత్సరాల నుంచి అద్భుతమైన టెక్స్‌టైల్ డిజైనింగ్ కల్చర్ ఉంది. కలంకారీ, ఇకత్ పోచం పల్లి, గొల్ల భామ, రాజస్థాన్‌లో బాందినీ, గుజరాతీలో లెహెరియా, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ ఎప్పటి నుంచో ఉన్నాయి. అలాగే 'పరాగ మంజరి' మన దేశానికే వన్నె తెచ్చేలా తీసుకురావాలన్నది నా ప్రయత్నం. దీనిని తెలంగాణ ప్రభుత్వం టెక్స్‌టైల్ శాఖకు అందించి, వారి సపోర్ట్ తీసుకొని, ఈ వర్క్‌ను వెలుగులోకి తీసుకురావాలనుకుంటున్నాం'' అని శివాని నేత చిలుకూరి తెలియజేశారు.

– నిర్మలారెడ్డి,
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

లక్ష ప్యాటర్న్స్

ఒక్కో చెట్టు పువ్వుకు ఒక్కో ప్రత్యేకమైన పరాగ రేణువులు ఉంటాయి. ఈ పరాగ రేణువుల మోడల్స్ నుంచి కొన్ని లక్షల ప్యాటర్న్స్ టెక్స్‌టైల్ రంగంలోకి తీసుకురావచ్చు. వీటిని పట్టు, కాటన్, సిల్క్, బెడ్ షీట్స్.. ఇలా ప్రతి క్లాత్ మీదకు తీసుకురావచ్చు. ఈ ప్రాజెక్ట్ తయారు చేస్తున్నప్పుడు ప్రపంచంలో ఎవరైనా ఇలా చేశారా.. అని శోధించాను. కానీ, ఎక్కడా మాకు ఆ సమాచారం లభించలేదు. అందుకే, పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్యాటర్న్స్ వస్త్ర డిజైన్ పరిశ్రమల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి.



– డాక్టర్ అల్లం విజయ భాస్కర్‌రెడ్డి,
అసోసియేట్ ప్రొఫెసర్,
బోటనీ డిపార్ట్‌మెంట్, ఉస్మానియా యూనివర్శిటీ

స్త్రీ శక్తి



మన్నిదా బాను

ప్రాణం నిలిపి

మన్నిదా బాను మంగుళూరులోని కద్రి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్. ఈమధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరారు. అక్టోబర్ 23 తెల్లవారు జామున 3.40 కి ఆ స్టేషన్ కి కాల్ వచ్చింది. అక్కడికి దగ్గర్లోని పాలిటెక్నిక్ కాలేజీ సెంటర్లో పెద్ద ఆక్సిడెంట్ అయింది. పికప్ వెహికల్, కంటైనర్ ట్రక్కు ఢీ కొట్టుకున్నాయి. ఇదీ ఆ కాల్. వెంటనే మన్నిదా తన స్కూటీ పై ప్రమాద ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె వెళ్ళేటప్పటికి ఆ వాహనాలు తుక్కు తుక్కు అయి ఉన్నాయి. ఒక వ్యక్తి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. ఆ రెండు వాహనాలలో ఒకదాని క్లీనర్ అతను. మన్నిదా అతడి పరిస్థితిని గమనించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని అతి కష్టమ్మీద లేపి, తన స్కూటర్ పై నేరుగా ఆ దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి మోసుకెళ్లారు. అతడి ప్రాణాలని నిలబెట్టగలిగారు.

ఆమె టైమ్ సెన్స్, ఆమె వేగం, ఆమె ధైర్యం, ఆమెలోని కారుణ్యం, ఆమె యూనిఫామ్.. అన్నీ పంచభూతాల్లా ఒకటై ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాయనే అనుకోవాలి. అదే కనుక.. పోలీస్ కాకుండా ఒక మామూలు వ్యక్తి ఎవరైనా అంతలా గాయపడిన వారిని తీసుకెళితే ప్రైవేటు హాస్పిటల్స్ చేర్చుకుని ఉండేవా?! 'మేం అడ్మిట్ చేసుకోడానికి లేదు. ఇది పోలీస్ కేస్..' అని ఉండేవి.

'వాయు వేగంగా స్పందించి ఒకరి ప్రాణాన్ని నిలబెట్టిన కద్రి స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ మన్నిదా బానుకు' అభినందనలు అంటూ తెల్లారగానే మంగుళూరు సిటీ పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ట్వీట్ పెట్టారు. మంగుళూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి కూడా మన్నిదాకు ప్రశంసలు అందాయి.

డ్యూటీ మైండెడ్ మాత్రమే అయి ఉంటే ఘటనా స్థలానికి వెళ్ళగానే ఫార్మాలిటీస్ లో పడి ఉండేవారు మన్నిదా. కానీ ఆమె అలా చేయలేకపోయారు. ఆమెలోని మానవతా హృదయం.. ఉద్యోగ విధి విధానాలను దాటి మరీ స్పందించింది. అందుకు 'తగిన శిక్ష' ఏదైనా ఉందంటే.. అది ప్రమోషనో, ప్రశంసాపత్రమో తప్ప మరొకటి అవుతుందా?! మన్నిదా మాత్రం.. 'నేను చేసింది ఏముందీ..!' అని చిరునవ్వుతో అంటున్నారు.. తనపై కురుస్తున్న అభినందనల జల్లులలో తడిసి ముద్ద అవుతూ.



రీనా వర్గీస్

ప్రాణాలకు తెగించి

సాహసాన్ని వెన్నెముకగా ధరించే వాళ్లకు అసాధ్యం ఉండదు. హై–రిస్క్ అనేది ఉండదు.

ఈ విషయాన్ని మరోసారి అక్షరాలా నిరూపించింది పైలట్ రీనా వర్గీస్. అడవిలో, అత్యంత ప్రతికూల పరిస్థితులలో ప్రాణాపాయంలో ఉన్న జవాన్‌ను ఆస్పత్రికి తరలించింది.

రీనా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కొత్తలో... 2009లో సీనియర్ పోలీసు అధికారులను తీసుకు వెళుతున్న హెలికాప్టర్‌ను మావోయిస్టులు కూల్చివేశారు. తాను చేస్తున్న ఉద్యోగం ఎంత రిస్క్ అనేది అర్థం చేసుకోవడానికి ఆ సంఘటన రీనాకు ఉపయోగపడింది.

తాజా విషయానికి వస్తే...

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కమాండోలు, మావోయిస్టులకు మధ్య ఎనిమిది గంటల పాటు జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో ఒక కమాండో తీవ్రంగా గాయపడ్డాడు. మావోయిస్టుల రాకెట్ దాడులకు అవకాశం ఉన్న ఆ ప్రమాదకరమైన పరిస్థితుల్లో గాయపడిన కమాండోను అక్కడి నుంచి తరలించడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే.

ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని అందుకున్న రీనా వర్గీస్ తన ప్రాణాన్ని లెక్క చేయకుండా హన్స్ హెలికాప్టర్‌తో రంగంలోకి దిగింది. కో–పైలట్‌కు కమాండ్స్ అందజేసి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో హెలికాప్టర్‌ను వీలైనంత వరకు దించి కిందికి దూకింది.

తాడు సహాయంతో గాయపడిన కమాండోను హెలికాప్టర్‌లోకి తీసుకువచ్చింది. 30 నిమిషాలలో గడ్చిరోలికి అక్కడి నుండి నాగ్‌పూర్ తరలించింది. మూడు బుల్లెట్లు తగిలిన కమాండోకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ చేసిన రీనా వర్గీస్ గతంలో ఎన్నో ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లలో పాల్గొంది. కోవిడ్ మహమ్మారి సమయంలో బాధితులను లక్షద్వీప్ నుంచి కొచ్చికి తరలించే రెస్క్యూ ఆపరేషన్‌లలో చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకుంది.

తాళపత్ర కళ



బాల త్రిపుర సుందరి



అవసరం ఒక ఆవిష్కరణకు దారి వేసింది. ఆర్థిక అవసరాలే తనను హ్యాండీక్రాఫ్ట్ కళాకారిణిగా తీర్చిదిద్దాయని చెప్పారు బాల త్రిపుర సుందరి. తాటి ఆకులతో గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు తయారు చేస్తారామె. వీటి తయారీలో మహిళలకు శిక్షణనిస్తారు కూడా. తాటి ఆకు కళారూపాల తయారీలో యాభై ఏళ్ల అనుభవం ఆమెది.

ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేసింది!

త్రిపుర సుందరికి 75వ సంవత్సరం. ఆమెది తూర్పుగోదావరి జిల్లాలో ఓ కుగ్రామం. చదువుకు నోచుకోని త్రిపుర సుందరి 1972లో ముంబయికి వెళ్లి హస్తకళాకృతుల తయారీలో సర్టిఫికేట్ కోర్సు చేశారు. అక్కడ నేర్పించిన కళారూపాలతోపాటు తన క్రియేటివిటీతో మరి కొన్ని రూపాలను తయారు చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హస్తకళాకృతుల ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టారు. ప్రస్తుతం హైదరాబాద్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజాలో పామ్ క్రాఫ్ట్ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు.



పనిలోనే ఆనందం

''మా ఊరిలో తెలిసిన వాళ్ల ద్వారా ముంబయిలో శిక్షణ కోర్సు గురించి తెలిసింది.. మూడు నెలల కోర్సు, బస భోజన వసతులు వాళ్లే ఏర్పాటు చేస్తారని చెప్పారు. చదువు లేదు, భాష ఇబ్బందవుతుందేమోనని భయంతోనే వెళ్లాను. కానీ అక్కడ తెలుగు వాళ్లు కూడా ఉండడంతో ఇబ్బంది కలగలేదు. క్రమంగా హిందీలో చెప్తున్న విషయాలు అర్థం కాసాగాయి. కోర్సు పూర్తయిన తర్వాత మా ఊరికి వచ్చి, నిడదవోలులో ఉన్న తాటిబెల్లం ఫెడరేషన్ లో ట్రైనర్‌గా ఉద్యోగంలో చేరాను. బదలీ మీద 1983లో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కి వచ్చాను. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్‌తో కూడా పని చేశాను. ఆ ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇప్పుడు కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డులో మా ఇంటి దగ్గర నాకు నచ్చిన కళారూపాలు అల్లుకుంటూ, ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెడుతున్నాను. వీటితోపాటు తుక్కుగూడలోని నీరా యూనిట్‌లో శిక్షణనిస్తున్నాను. బంధువులు, స్నేహితులు ఇంకా పని చేయడం ఎందుకని అడుగుతుంటారు. పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయి, నేను పని చేయకపోతే అడిగేవాళ్లు కూడా లేరు. కానీ నాకు పని చేయకుండా కూర్చుని తినడం ఇష్టం ఉండదు. ఆరోగ్యం బాగున్నప్పుడు పని మానేయడం ఎందుకు?'' అంటూ స్టాల్‌లో ఆమె బొమ్మల ధరలు అడుగుతున్న వారికి బదులివ్వడంలో మునిగిపోయారామె.

– విఎమ్‌ఆర్
ఫోటోలు: ఎస్ఎస్ ఠాకూర్



హెల్దీ డైట్

సూజీ బ్రెడ్



కావలసినవి: బొంబాయి రవ్వ – ఒకటిన్నర కప్పులు; **ఇన్‌స్టంట్ ఈస్ట్** – టీ స్పూన్; **చక్కెర పొడి**– టేబుల్ స్పూన్; **ఉప్పు** – పావు టీ స్పూన్; **పాలు** – 3 టేబుల్ స్పూన్‌లు; **నీరు** – అర కప్పు; **నూనె** – 2 టేబుల్ స్పూన్‌లు; **వెన్న** – టీ స్పూన్; **సీడ్స్** – 3 టేబుల్ స్పూన్‌లు (బాదం పలుకులు, పిస్తా, గుమ్మడి గింజలు, డ్రైఫ్రూట్ చిప్స్ వంటివి).

తయారీ

- రవ్వను మిక్సీజార్‌లో మెత్తగా పొడి చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో ఈస్ట్, చక్కెర పొడి, ఉప్పు వేసి కలపాలి.
- అందులో నీరు, పాలు, నూనె వేసి బీటర్‌తో బాగా కలిపి పది నిమిషాల సేపు పక్కన ఉంచాలి.
- అడుగు చదరంగా ఉన్న పాత్రకు వెన్న రాసి అందులో పై మిశ్రమాన్ని వేసి చపాతీల పిండిని కలిపినట్లు చేత్తో 15 నిమిషాల సేపు మర్దన చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్లతో సాగదీస్తే పలచబడుతూ సాగాలి. అలా వచ్చే వరకు మర్దన చేసి వేరొక పెద్ద పాత్రకు వెన్న రాసి అందులో పెట్టి మూత పెట్టాలి. ఆ పాత్రను గంట సేపు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి, పిండి రెండింతలవుతుంది.
- ఏడంగుళాలు, నాలుగు అంగుళాల కొలతల లోఫ్ పాన్‌కు వెన్న రాసి అందులో బ్రెడ్ పిండిని పెట్టి అర గంట సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ కొలతలతో చేసిన పిండి పాన్‌లో సగానికి మాత్రమే వస్తుంది. అరగంట సేపటికి పిండి పరిమాణం రెండింతలవుతుంది. ఆ మిశ్రమం లోఫ్ పాన్‌లో పూర్తిగా అమరే లోపు పిండి మీద పాలను అద్ది ఆ పైన బాదం ఇతర గింజలను చల్లాలి.
- ఈ లోపు ప్రెషర్ కుకర్‌ను వేడి చేయాలి. లోఫ్ పాన్‌ను కుకర్‌లో అమర్చిన తర్వాత మూతపెట్టి 25 నిమిషాల సేపు చిన్న మంట మీద ఉంచాలి.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఒంటె బుక్ చేయాలి ఓటిపి నంబర్ ఎంత?

ఊబర్, ఓలాలో ఆటోనో స్కూటరో కారో బుక్ చేయొచ్చు. వస్తుంది. కాని ఒంటెను బుక్ చేయొచ్చా? దుబాయ్‌లో ఇద్దరు ఆడవాళ్లు ఎడారిలో తప్పిపోయారు. ఊబర్‌లో వెతికి ఒంటెను బుక్ చేశారు. ఒంటె ఐదు నిమిషాల్లో వచ్చింది. ఎక్కారు. ఇంటర్‌నెట్‌లో సరదా దుమారం రేపుతున్న ఈ కథనం వెనుక యదార్థం ఏమిటి?



పల్లెటూరులో ఉన్నప్పుడు ఎడ్లబండి, నది ఒడ్డున పడవ, అడవిలో ఏనుగు, కొండ దారిలో గాడిద, ఎడారిలో ఒంటె ఇలా ఊబర్ ద్వారానో ఓలా ద్వారానో బుక్ చేసే వీలుంటే ఎంత బాగుంటుంది? ఏమో ఆ రోజులు కూడా వస్తాయేమో. రెండు రోజుల క్రితం అలాంటి విషయాన్నే చూపి లోకాన్నంతా ఆకట్టుకుంది ఒక వీడియో. దుబాయ్‌లో ఇద్దరు మహిళలు 'మేము ఎడారిలో తప్పిపోయాం. ఊబర్‌లో ఒంటె ఉందేమో చూద్దాం' అని ఫోన్‌ని స్క్రోల్ చేస్తే ఒంటెను బుక్ చేసే ఆప్షన్ ఊబర్‌లో కనిపించింది. వారిలోని ఒక మహిళ ఒంటెను బుక్ చేయగానే దీపక్ అనే వ్యక్తి ఐదు నిమిషాల్లో ఒంటెతో ప్రత్యక్షమయ్యాడు. ఇంకేముంది... ఆ మహిళల ఆనందానికి హద్దే లేదు. వారిలో ఒకామె ఒంటెనెక్కి 'ఇది భలే ఉంది' అనుకుంటూ ఇంటిదారి పట్టింది. ఈ వీడియో ఇంటర్‌నెట్‌లో రాగానే లక్ష లైకులు సంపాదించుకుంది. సరదా వ్యాఖ్యల్ని కూడా. 'ఓటీపీ నంబర్ ఎంత?', 'దుబాయ్‌లో అంతే', 'నంబర్ ప్లేట్ ఎక్కడ'... ఇలా. నిజానికి ఇది నిజంగా జరగలేదు. 'జెట్‌సెట్ దుబాయ్' అనే ట్రావెల్ సంస్థ ఊబర్‌తో కలిసి చేసిన ప్రమోషనల్ వీడియో. దుబాయ్‌లో అయినా సరే ఊబర్ ఒంటె సర్వీస్‌ను ఇవ్వదు. కాని 'ఏటీవీ' (ఆల్ టెర్రయిన్ వెహికిల్)ను బుక్ చేసుకోవచ్చు. దుబాయ్‌లో ఊబర్ బ్లాక్ (హైఎండ్ కార్లు), గ్రీన్ (ఎలక్ట్రిక్ కార్లు), ఎల్‌యుఎక్స్ (లగ్జరీ కార్లు) రైడ్‌కు పంపుతుంది. మొత్తం మీద ఈ యాడ్ కొత్త ఆలోచనలు రేకెత్తించింది. కార్లు, బైక్‌లు, ఆటోలకు ఉన్న ఇలాంటి సర్వీసులు ఇకపై ప్రాంతాన్ని బట్టి మారితే బాగుండనిపించింది.

బ్యూటిప్స్

మెరిసే మేని ఛాయను కాపాడుకోవాలంటే..



- తక్షణ తాజాదనం కోసం రోజ్ వాటర్ లేదా దోసకాయ రసంతో మేనికి మర్దనా చేసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పచ్చి పాలను కాటన్ బాల్‌తో అద్దుకొని, ముఖానికి రాయాలి. 10 నిమిషాల పాటు అలాగే ఉంచి కడిగేయాలి. పాలలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మాన్ని సున్నితంగా ఉంచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- చర్మంపై నుంచి సహజ నూనెలను పోకుండా ఉండటానికి చర్మతత్వానికి సరిపోయే తేలికపాటి, క్లెన్సర్‌ని ఉపయోగించాలి.
- ఓట్‌మీల్‌లో తేనె, కొద్దిగా నీళ్లతో కలిపి పేస్ట్ చేయాలి. మృత చర్మ కణాలను తొలగించడానికి, పోర్స్‌ను శుభ్రం చేయడానికి సున్నితంగా స్క్రబ్ చేయాలి.
- ప్రతిరోజూ కలబంద జెల్‌ను రాసి, మృదువుగా మర్దనా చేయాలి. దీని వల్ల చర్మం నునుపుగా, తేమగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ తేనెను, టేబుల్ స్పూన్ పెరుగుతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మాన్ని కాంతిమంతం చేస్తుంది.
- సగం అరటిపండును మెత్తగా చేసి, టీస్పూన్ తేనెతో కలపాలి. చర్మం మృదువుగా, మెరుస్తూ ఉంటుంది.
- కొద్దిగా గ్రీన్ టీని కాచి, చల్లబరచాలి. ఈ నీటిని దూదితో అద్దుకుంటూ, మేనికి పట్టించాలి. ఎండకు కమిలిన చర్మం తాజాగా మారుతుంది.